జాగ్రత్తలతో ఊపిరి పీల్చుకుందాం..!

- పెరుగుతున్న ఊపిరితిత్తుల సమస్యల బాధితులు
- నేడు 'వరల్డ్ లంగ్ డే'
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సూచన



> మనం శ్వాస తీసుకోవడానికి ఊపిరితిత్తులు ఎంతో కీలకం. సాధారణంగా రోజులో దాదాపు 25వేల సార్లు ఊపిరి తీసుకుంటాం. మనం పీల్చే గాలిలో పలు వాయువులు, తెలియాడే బ్యాక్టీరియా, వైరస్, వాతావరణంలో ఉండే వివిధ రకాల కాలుష్య కారకాలు ఉంటాయి. ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను శరీరం అంతా పంపిణీ చేస్తాయి. ఆధునిక జీవన శైలి వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఊపిరి తీసుకోవడం కష్టమై కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఊపిరితిత్తుల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 25న వరల్డ్ లంగ్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లాలో 50 మంది పల్మనాలజిస్టులు (ఊపిరితిత్తుల స్పెషాలిటీ వైద్య నిపుణులు) సేవలందిస్తున్నారు. ఒక్కో డాక్టర్ వద్దకు రోజూ 30 నుండి 50 మంది ఊపిరితిత్తుల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. కరోనా సమయంలో ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స చేసే పల్మనాలజిస్టుల పాత్ర బాగా పెరిగింది. కరోనా నుంచి కోలుకున్న పిదప తిరిగి కొంతమందికి పోస్ట్ కొవిడ్ సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి పల్మనాలజిస్టులు సకాలంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు రక్షిస్తున్నారు.

వచ్చే జబ్బులు ఇవీ....

ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధుల్లో ఆస్తమా, సీవోపీడీ, లంగ్ క్యాన్సర్, టీబీ ముఖ్యమైనవి. ఎక్కువ శాతం మరణాలకు ఈ వ్యాధులే కారణం. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఏడు లక్షల మంది పిల్లలు ఊపిరితిత్తులకు వచ్చే న్యూమోనియాతో చనిపోతున్నారు. ప్రతి రెండు నిమిషాలకు ఒక పిల్లాడు ఇలా ప్రాణాలు కోల్పోతున్నాడు. ఏటా 200 మిలియన్ల మంది ఊపిరితిత్తుల సంబంధమైన సీవోపీడీ వ్యాధి బారిన పడుతున్నారు. వీరిలో సుమారు 3.2 మిలియన్ల మంది చనిపోతున్నారు. ఏటా 262 మిలియన్ల మంది ఆస్తమా బారిన పడుతున్నారు. ప్రతి ఏడాది 2.2 మిలియన్ల లంగ్ క్యాన్సర్ కేసులు కొత్తగా నమోదవుతున్నాయి. ఈ కారణంగా 1.80 మిలియన్ల మంది చనిపోతున్నారు. ప్రతి ఏడాది లక్షల మంది ఊపిరితిత్తుల టీబీ, ఆస్తమా బారిన పడుతున్నారు. కొంత మంది చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

వ్యాధులు గుర్తించడం ఎలా?

ఎక్కువగా దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, ఛాతీపట్టివేయడం వంటి లక్షణాలు కనిపిస్తే అది సీఓపీడీ వ్యాధిగా గుర్తించాలి. తరచుగా జలుబు చేయడం, ఒళ్లు దురద, కళ్లు మంటలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు, సరిపడకపోవడం వంటి లక్షణాలను ఎలర్జీగా గుర్తించాలి. జ్వరం, కళ్లెతో కూడిన దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు ఛాతీలో నొప్పి ఉంటే దానిని న్యూమోనియా వ్యాధిగా భావించాలి. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్షయ వ్యాధిగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లంగ్ క్యాన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డీ వ్యాధిగా గుర్తించాలి.

వీరికి ప్రమాదం ఎక్కువ...

ధూమపానం చేసేవారు, పొగతో కూడిన ప్రాంతాల్లో పనిచేసేవారు, పొగాకు ఉత్పత్తులు వినియోగించే వారు, ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు, వడ్రంగి పనులు చేసే వారు, పొగతో కూడిన వాహనాలను రిపేర్లు చేసే వారు, చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

ముందస్తు జాగ్రత్త చర్యలు అవసరం



క్రమం తప్పకుండా ఇన్‌ఫ్లూయెంజా, నీమోకోకల్ వ్యాక్సిన్లు వేయించుకోవడం వల్ల జలుబు, న్యూమోనియా లాంటి ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. పిల్లలకు తప్పనిసరిగా అన్ని రకాల వ్యాక్సిన్లు వేయించడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తకుండా కాపాడవచ్చు. ఈ వ్యాధులను ముందస్తు జాగ్రత్తలతో చాలా వరకు నివారించవచ్చు. గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, పొగతాగడం విడనాడాలి. దుమ్ము, ధూళి ఉన్న ప్రదేశాల్లో మాస్క్ ధరించడం చాలా ఉత్తమం. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి.

– డాక్టర్ బి. దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు





వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి,గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

- డయేరియా వ్యాప్తిపై అపోహలు వద్దు
- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- జీఎంసీ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలన



కిట్లు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ కె.రవీంద్ర, కమిషనర్ పి.శ్రీనివాసులు

నెహ్రూనగర్: డయేరియాపై ప్రజలు అపోహలకు గురికావద్దని, కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటూ ఇంటిలో వండిన ఆహారాన్నే తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కోరారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రగతినగర్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జీఎంసీ సిద్ధం చేసిన కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణకు నగరపాలక సంస్థతో కలిసి జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. డయేరియా కేసులు నమోదు అయిన ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా పరిగణించి పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరుస్తామన్నారు. దీంతోపాటు రక్షిత నీటి సరఫరాల కోసం జిల్లా అధికారులను ఒక్కో వార్డు సంబంధిత విధులు కేటాయించామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ డయేరియా ప్రభావిత ప్రాంతమైన ప్రగతినగర్‌లో హ్యాండ్ వాష్, లైఫ్ బాయ్, ఓఆర్‌ఎస్, ఫినాయిల్, న్యాప్‌కిన్లతో కూడిన వెయ్యి కిట్లను అందించామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో కూడా అందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలు ప్రాంతాలకు నగరపాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. వాటిని కూడా ప్రజలు కాచి చల్లార్చే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఈ నెల 26వ తేదీన గుంటూరు నగరంలోని మాజేటి కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ కమిటీ అధ్యక్షుడు పర్చూరి సంజీవరావు తెలిపారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రజాకార్లను, పెత్తందార్లను తరిమికొట్టి పేదలకు న్యాయం చేసిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ తరహాలో ఏపీలోనూ ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు అన్నవరపు నాగేమల్లేశ్వరరావు మాట్లాడుతూ బీసీలు, రజకులంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రజకులకు ఎమ్మెల్సీ పదవి, నామినేటెడ్ పోస్టుల్లో, స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రజకులకు రక్షణ చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘాల నాయకులు బి.శ్రీనివాసరావు, వంగపాటి అంజయ్య, యాంపాటి శివసాయికృష్ణ, తుమేటి మురళి, కిరణ్, విజయలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి


సీఐటీయూ నాయకుల డిమాండ్



డీఆర్‌డీఏ కారాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: యానిమేటర్లకు పెట్టిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ప్రభుత్వాలు మారినప్పుడు రాజకీయ కారణాలతో తొలగించే విధానం విడనాడాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. గుంటూరులోని జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద బుధవారం యానిమేటర్ల ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యానిమేటర్ల బర్రెలు, గొర్రెలు, కోళ్లు, విత్తనాలు విక్రయాలకు సంబంధించి లక్ష్యాలు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సొంత ఇల్లు కూడా లేని పొదుపు సంఘం సభ్యులకు వీటిని అంటగట్టడం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని అన్నారు. తెనాలిలో మంత్రి సతీమణి యానిమేటర్లపై పెత్తనం చెలాయిస్తూ ఇబ్బందులు గురి చేయడం మానుకోవాలని కోరారు. యానిమేటర్ల కుటుంబాలకు భరోసా కోసం గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నా అనంతరం డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సంఘం ప్రతనిధులు శివకుమారి, పద్మ, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 18న పాతగుంటూరు చిన్నంవారి వీధిలో నివాసం ఉండే కాకుమాను శివలీల నివాసంలో చోరీ జరిగింది. పాతగుంటూరు యాదవబజారుకు చెందిన అల్లం సాయితేజ, ప్రకాశం జిల్లాకు చెందిన ప్రస్తుతం అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామంలో నివాసం ఉంటున్న తోకల భాస్కర్‌లు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇలా రూ. 2.40 లక్షలు చోరీ వారు చేశారు. పొన్నూరు రోడ్డులో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అరెస్టు చేశారు. రూ. 2.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, ఎస్సై రెహమాన్‌లు కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు.

మరో ఘటనలో మహిళ కూడా...

గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన రోగుల బంధువులకు మత్తు మందు ఇచ్చి బంగారం గొలుసు దోచుకెళ్లిన మహిళను అరెస్టు చేశారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య చౌదరి వివరాలు వెల్లడించారు. పేరేచర్ల గ్రామానికి చెందిన దీనమ్మ తన కుమారుడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ నెల 15న గురజాల మండలానికి చెందిన లక్ష్మీబాయి తమ మామయ్య ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం తీసుకురాగా, మృతి చెందాడు. రాత్రి సమయంలో టీస్టాల్ వద్ద కూర్చుని ఉండగా, దీనమ్మ ఆమె వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పి నమ్మబలికింది. టీలో మత్తు బిళ్లలు కలిపి స్పృహ కోల్పోయిన తరువాత లక్ష్మీబాయి మెడలోని బంగారు తాడు కాజేసింది. ఈ నెల 18న ఆర్టీసీ కాలనీ రాహుల్‌గాంధీనగర్‌కు చెందిన నరసమ్మ తన అల్లుడికి అనారోగ్యంతో ఉండటంతో అడ్మిట్ చేయించి సహాయంగా ఉంది. నరసమ్మకు కూడా మత్తు బిళ్లలు కలిపి టీ తాగించి మెడలోని బంగారు గొలుసు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద బుధవారం నిందితురాలిని గుర్తించారు. రూ. 4.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

స్వీపర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలి




మాట్లాడుతున్న దండాల లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: పాఠశాలల్లో స్వీపర్లకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సంఘం – సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు దండాల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఇప్పుడిచ్చే రూ.6 వేల జీతం కూడా నెలల తరబడి పెండింగులో ఉంచితే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. మున్సిపల్ స్కూల్లో పనిచేస్తున్న కంటిజన్సీ వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. గ్రామాల్లో రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తీరు మారకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. తర్వాత యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అమల, అంజలి, జిల్లా గౌరవాధ్యక్షుడుగా దండా లక్ష్మీనారాయణ, 21 మందితో కార్యవర్గం ఎన్నికైంది.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చునని విజయవాడలోని ఆయుర్వేద కళాశాల పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ మాట్లాడుతూ ఆయుర్వేద ఔషధాలను నిత్యజీవన విధానంలో పాటించాల్సిన ఆహార నియమాలను వివరించారు.

సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర



గుంటూరు ఎడ్యుకేషన్: సామాజికసేవలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. బుధవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథక ఆవిర్భావ దినోత్సవంతోపాటు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ క్విజ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి రెండు వేల మందికిపైగా యువత నమోదు చేసుకున్నారని తెలిపారు. అక్టోబరు 15వ తేదీలోపు మై భారత్ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఎం. సంతోష్ కుమారి, ధాత్రి కుమారి, సుబ్బరత్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డయేరియా ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక పర్యవేక్షణ



నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో విధులు కేటాయించబడిన జిల్లా (నోడల్) అధికారులు ప్రతి రోజు తాగునీటి నమూనాలు తీసి, ల్యాబ్‌కు పంపేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నోడల్ అధికారులతో బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాలలో ఏఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. డయేరియా లక్షణాలతో మెడికల్ క్యాంప్‌కు వచ్చే వారు, చికిత్స తీసుకునేవారు, జీజీహెచ్‌కు రిఫర్ చేయబడిన వారి వివరాలను నివేదికగా ఇవ్వాలన్నారు. ఇంటింటి సర్వే సమర్థంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. తమ దృష్టికి వచ్చే తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను నోడల్ అధికారులు వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

జీజీహెచ్ కాంట్రాక్టు ఉద్యోగి తొలగింపు తగదు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో 14 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో ఈసీజీ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న నందిగామ నాగరాజును లైంగిక వేధింపుల ఆరోపణల నెపంతో ఉద్యోగం నుంచి తొలగించడం తగదని పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగరాజును ఉద్యోగం నుంచి తొలగించిన విధానంలో విచారణ కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా లేవని ఆరోపించారు. విద్యార్థులను భయపెట్టి కొందరు తప్పుడు సాక్ష్యాలు చెప్పించారని తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. విచారణ కమిటీ కాపీలను తమకు అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు దున్న సాంబయ్య మాదిగ, పల్లెపోగు థామస్ మాదిగ, మేకల జోజి మాదిగ, దావులూరి కుమార్ మాదిగ, డేగల బాబు మాదిగ, గాలిముట్టి కిరణ్‌కుమార్ మాదిగ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పోలీసులు కేసు నమోదు చేశారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జిన్నాటవర్ సెంటర్‌లోని బాలాజీ లాడ్జీలో తమిళనాడుకు చెందిన నారాయణస్వామి (55) ఉంటున్నాడు. వంట మాస్టరుగా పనిచేస్తూ నిత్యం పనులకు వెళ్లి లాడ్జికి వస్తుండేవాడు. మద్యం అలవాటు ఉన్న నారాయణ స్వామికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఈ నెల 23వ తేదీన రాత్రి ఎప్పటిలానే పనులకు వెళ్లి రూముకు వచ్చాడు. బుధవారం ఉదయం 8 గంటలకు రూమ్ బాయ్ చూడగా మృతి చెంది పడి ఉన్నాడు. లాడ్జి యజమాని తిరుపతిశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగ దోపిడీ

లక్ష్మీపురం: ఓ వృద్ధురాలు ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 2.50 సవర్ల బంగారు నగ దోచుకెళ్లాడు. పట్టాభిపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం ప్రాంతానికి చెందిన పత్తూరి హైమావతి అనే వృద్ధురాలు ఇంటి నుంచి బయలు దేరి బ్రాడీపేటలో నివాసం ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. గంట తరువాత తిరిగి వస్తున్న నేపథ్యంలో బ్రాడీపేట అడ్డరోడ్డుకు వచ్చే సరికి ఓ గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలోని 2.50 సవర్ల బంగారు నగను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు కేకలు పెట్టడంతో స్థానికులు వచ్చారు. అప్పటికే ఆ వ్యక్తి పారిపోయాడు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన ప్రచారం



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో డీఆర్‌ఎం సుథేష్ణ సేన్ ఆదేశాల మేరకు రైల్వే కాలనీలో పారిశుద్ధ్యం ప్రచారాన్ని నిర్వహించారు. డివిజన్ పీఆర్‌ఓ బి.వినయ్‌కాంత్ ఈ మేరకు తెలిపారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి శుభ్రత, ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించామన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: మధ్యప్రదేశ్‌లో అక్టోబర్ 4, 5, 6వ తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు కెనడీ నెక్ట్స్ జెన్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు తెలిపారు. బుధవారం అరండల్‌పేటలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 21న కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన 2వ తరగతి విద్యార్థి జరుబుల రిషిసాయి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ఇన్‌చార్జి వసంత లక్ష్మిలు విద్యార్థి రిషిసాయిని అభినందించారు.

దుర్గాస్తుతిపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీదుర్గాస్తుతిపై ఆధ్యాత్మిక ప్రవచనం మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపనిషన్మందిరం సభ్యులు శ్రీ నిష్ఠల నరసింహమూర్తి ప్రసంగిస్తూ.. పోతన సరస్వతి ప్రార్థన పద్యం గురించి వివరించారు.

సమాజ మార్పునకు జాషువా ఎంతో కృషి



నగరంపాలెం: తేట తెలుగులో బైబిల్‌ను క్రీస్తు చరిత్రగా పద్యంగా అందించిన మహాకవి గుర్రం జాషువా అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద గుర్రం జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో క్రీస్తు చరిత్ర ఖండ కావ్యంపై సభ నిర్వహించారు. సభకు గుంటూరు ఏపీపీ శుద్ధపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ జాషువా సమాజంలోని అసమానతలపై ఆవేదనతో సృజించిన సాహిత్యం సమాజ మార్పునకు ఎంతో దోహదం చేసిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవుడై ఉండి హిందూ మత సంబంధ రచనలు చేస్తున్నాడని ఆయన్ను వెలి వేసినా ఆయన రచించిన క్రీస్తు చరిత్రకు కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం చేసిందని గుర్తుచేశారు. బాబురావు, జాన్‌బాబు, డాక్టర్ మూకీరి సుధ పద్య గానం చేశారు. సభలో టీడీపీ నేత డేగల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, శ్రీనగర్ 7/4వ లైను, కొత్త డోర్.నెం. 32-11-740, కాపురస్థులు నల్లూరి బదరీనాథ్ గారి కుమారుడు నల్లూరి వెంకట శివ నాగ అనిల్ కుమార్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, గుంటూరు నగరం, 7/4 శ్రీనగర్, డోర్.నెం. 7-16-249 వాస్తవ్యులు అయిన 1) లేటు కటారి శ్రీనుగారి భార్య విమల, వీరి కుమార్తెలు 2) రెడ్డి వెంకటేశ్వర రావు గారి భార్య రెడ్డి దేవీ సరస్వతి, 3) రాడిశెట్టి రమణయ్యగారి భార్య రాడిశెట్టి రాములమ్మ @ రామ లక్ష్మీ, 4) కటారి మమత గారలు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి యజమానులమని మరియు నిర్వివాదమైన ఆస్తి అని నా క్లయింటును నమ్మించి యున్న దరిమిలా నా క్లయింటు సదరు వ్యక్తుల నుండి ఈ దిగువ పేర్కొనబడిన షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి క్రయం పొందుటకు నిర్ణయించుకొని పై వారలకు అడ్వాన్సు క్రయ ప్రతిఫలం చెల్లించి ది. 25-08-2025న వారి నుండి విక్రయబయానా అగ్రిమెంటును వ్రాయించుకొనియున్నారు. దరిమిలా నా క్లయింటు పూర్తి క్రయ ప్రతిఫలం చెల్లించి పై వారలనుండి విక్రయ దస్తావేజు వ్రాయించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు సిద్ధపడి యున్నారు. కావున ఎవరికైనా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని, స్వాధీనాను భవములు గాని, ఇంటరెస్టుగాని, రైట్స్ గాని యున్నయెడల ఈ ప్రకటన వెలువడిన దినము నుండి పదిరోజులలోపు లిఖిత పూర్వకముగా నాకు గాని, నా క్లయింటుకు గాని తెలపవలసినది. లేనియెడల ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నిర్వివాదమైన ఆస్తిగా నిర్ణయించుకొని నా క్లయింటు పై వారలకు పూర్తి క్రయ ప్రతిఫలం చెల్లించి వారల నుండి రిజిష్టర్ విక్రయ దస్తావేజును పొందగలరు. తదుపరి వచ్చు క్లయిములకు నా క్లయింటు బాధ్యుడు కాదు మరియు సదరు క్లయిములు నా క్లయింటును బంధింపజాలవు.

షెడ్యూలు: గుంటూరు డి.,గుంటూరు సబ్.డి. యిలాకా జి.యం.సి పరిధిలో చేరిన గుంటూరు సిటీ, శ్రీనగర్, 7/4వ లైను నందలి మునిసిపల్ పాత వార్డు నెం.3 రు, కొత్త వార్డు నెం.5 రు, ప్రస్తుత వార్డు నెం.8 రు, బ్లాకు నెం. 12రు, టి.యస్.నెం.711/1రు, విస్తీర్ణం య.7-30056ర.అ.లు మింజుములె చ.గ. 145-66లు స్థలము, అందలి మునిసిపల్ అసెస్మెంటు నెం.13867/డి.యస్ రు, డోరు నెం.7-16-249రు గల ఆస్తికి హద్దులు.**తూర్పు:**గండికోట గోవిందమ్మ గారి ఆస్తి హద్దు, అ.69లు, **దక్షిణం:**దూబగుంట్ల సాంబ శివరావు గారి ఆస్తి హద్దు అ.19లు, **పడమర:** ఇంద్ర నాగేశ్వరరావు గారి ఆస్తి హద్దు అ.69లు, **ఉత్తరం:**మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు హద్దు అ.19లు.యీ హద్దుల మధ్య చ.గ.145.66లు లేక చ.మీ. 121.79ల స్థలము ఇందలి ఆర్.సి.సి. డాబా మేడ,ఏ.సి.సి. రేకులఇల్లు వగైరా యావద్విశిష్టములతో సహా

సి.డి. భగవాన్, అడ్వకేట్.
డోర్.నెం.7-11-200/a, అరండల్‌పేట 4వ లైను ఎదురు, రింగ్‌రోడ్డు, గుంటూరు. సెల్: 9666158338, 9440214578